క్లుప్తంగా

శ్రీసాయి ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



తెనాలి: కలియుగంలో ధానధర్మాలు, నామ స్మరణతోనే దేవుడిని ఆరాధించేందుకు ఆచరించాల్సిన ధర్మమని శ్రీకృష్ణ భగవానుడు ఏనాడో చెప్పారని, మన శాస్త్రాలు కూడా ఇదే చెబుతున్నాయని శ్రీసాయి ప్రసాదం సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను గురువారం చినరావూరు డొంక రోడ్డులోని మారుతి ఆలయంలో ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలోని 125 మందికి అన్నదానం చేశారు. పండగలు, పుట్టిన రోజులను పేదలతో జరుపుకుంటే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయని చెప్పారు. జలుబుల తేజేష్ జన్మదినం సందర్భంగా జరిగిన ఈ వితరణలో విశ్రాంత ప్రభుత్వ అధికారి రమణయ్య, సురేష్, వెంకయ్య, దేవాలయ ధర్మకర్త దేశయ్య పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు



తెనాలి అర్బన్: ఐటీఐ చదవడం వల్ల జీవనోపాధి త్వరగా దొరుకుతుందని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్ధార్థ ఐటీఐ వార్షికోత్సవ వేడుకల్ని అయితానగర్‌లోని కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల రాజేంద్ర ప్రసాద్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దంతలూరుకు చెందిన పల్లబోతు కోటేశ్వరరావు(48) బుధవారం సాయంత్రం బైక్‌పై తెనాలి వెళ్లి తిరిగి వస్తుండగా అత్తోట వద్ద ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని గుంటూరు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కొల్లిపర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడు మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. రైలు నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆరోగ్య విప్లవానికి నాంది పలికిన సీఎం జగన్

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి అర్బన్: రాష్ట్రంలో ఆరోగ్య విప్లవానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి నాంది పలికారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాలులో గురువారం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ క్యాంప్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది వార్డుల పరిధిలోని పేద ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరోరోజు శిబిరాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యశ్రీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం పేద ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి సైతం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందరికీ మంచి ఆరోగ్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కమిషనర్ ఎం. జశ్వంతరావు, కార్యక్రమ స్పెషల్ ఆఫీసర్ గాయత్రీదేవి మాట్లాడుతూ 1174 మందికి టోకెన్లు ఇవ్వగా, వారిలో 593 ఇక్కడికి వచ్చి చికిత్స పొందినట్లు చెప్పారు. ఫిజీషియన్ ఓపీ–72, జనరల్ సర్జన్ ఓపీ–133, అప్తమాలజీ ఓపీ–126, జనరల్ ఓపీ–202, బీపీ పరీక్షలు–405, షుగర్ పరీక్షలు–193, హెచ్‌బీ పరీక్షలు–293, ఈసీజీ–26, మలేరియా పరీక్షలు–6 చేసినట్లు ఆమె వివరించారు. వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గెడ్డేటి సురేంద్ర, గెడ్డేటి ఝాన్సీవాణి, అన్నాబత్తుని పద్మజ, వీర్లపాటి విజయలక్ష్మి, ఆవుల కోటయ్య, గడవర్తి శ్రీసాయిహరేరామ్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బూరెల దుర్గా, అక్కిదాసు కిరణ్‌కుమార్, మట్లపూడి రాజేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్



డాక్టర్‌తో పరీక్షలు చేయించుకునేందుకు క్యూలో ఉన్న మహిళలు

కఠెవరంలో శిబిరానికి విశేష స్పందన

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరానికి విశేష స్పందన లభించింది. 600 పైగా రోగులకు వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు ప్రత్యేకంగా చేశారు. అవసరమైన మందులల్ని ఉచితంగా పంపిణీ చేశారు ఐసీడీఎస్, తెనాలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకుంది. మండల ప్రత్యేక అధికారి వనజ, ఎంపీడీవో విజయాలక్ష్మణ్, సీడీపీవో సునీత స్టాల్స్‌ను సందర్శించారు. సురక్ష శిబిరంలో సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ మంచాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

దంతలూరు(కొల్లిపర): ఆరోగ్యమే మహాభాగ్యమని, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మండలంలోని దంతలూరు విలేజ్ హెల్త్ సెంటర్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష లో ఏడు పరీక్షలతో పాటు 14 వైద్యసేవల్ని అందిస్తున్నారని, వాటిని రోగులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సుమారు 500 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి జ్యోతుల భాగ్యమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.



మహిళకు చెవి పరీక్ష చేస్తున్న డాక్టర్

పేదలకు వైద్యం చేరువ



నాకు కళ్లు సరిగా కన్పించకపోవడంతో శిబిరానికి వచ్చా. ఒక కన్ను బాగోలేదని, మరొకటి బాగానే ఉందని చెప్పారు. దానికి మందులు ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం బాగుంది. గతంలో చిన్న, చిన్న రోగాలకు పెద్దమొత్తంలో ఖర్చు అయ్యేది. సురక్ష క్యాంప్‌ల ద్వారా ఉచితంగా అన్ని పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. పేద ప్రజలకు మంచి వైద్యాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–యల్లమాటి సరోజిని, అయితానగర్, తెనాలి

వైద్యులు బాగా చూస్తున్నారు



నీరసం, కళ్లు తిరగుతుండటంతో ఇక్కడికి చికిత్స నిమిత్తం వచ్చాను. ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో వైద్యులు బాగా చూస్తున్నారు. అన్ని పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు. సీఎం జగన్ పేదలకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నారు.

–నల్లూరి సరస్వతి, తెనాలి

మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు



శిబిరంలో ఎమ్మెల్యే శివకుమార్‌కు కంటి పరీక్షలు

తెనాలి: మానవత స్వచ్ఛంద సంస్థ, తెనాలి శాఖ పట్టణంలోని హెల్త్ హాస్పిటల్ సహకారంతో గురువారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలేజీ లైబ్రరీ హాలులో ఏర్పాటైన శిబిరాన్ని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ప్రారంభించారు. హెల్త్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శశికుమార్, డాక్టర్ కేశవ కంటి పరీక్షలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన శిబిరంలో 300 మంది విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు చేశారు. అవసరమైనవారికి కళ్లజోళ్లు సిఫార్సు చేశారు. మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఇది ఏడో కార్యక్రమంగా చెప్పారు. ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో వివిధ వర్గాల ప్రజల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు విద్యార్థినీ విద్యార్థుల కంటి వైద్య పరీక్షల నిమిత్తం ఈ శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు అనివార్యమైన నేటి రోజుల్లో యువతరం ఎక్కువసేపు స్క్రీనింగ్‌తో ఉంటున్న కారణంగా కంటి సమస్యలు వస్తున్నాయని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వైద్యశిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరాన్ని హెల్త్ హాస్పిటల్ మేనేజర్ శ్యామకుమార్, మానవత సంస్థ బాధ్యులు జి.నాగేశ్వరరావు, డీవీ సోమయ్య శాస్త్రి, ఆర్ఎస్ శంకరరావు తదితరులు పర్యవేక్షించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకరించింది.

ఖాజీపేటలో సంక్షేమ పథకాల లబ్ధి రూ.7 కోట్లు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో కేవలం ఒక్క ఖాజీపేట గ్రామ పేదలకే రూ.7 కోట్ల లబ్ధిని కలిగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం కొనసాగించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, యజమానులతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికీ కలిగిన లబ్ధిని వివరించారు. ఏమైనా సందేహాలున్నా, సమస్యలున్నా చెప్పాల్సిందిగా కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు అర్హులైన వారుంటే రెండు నెలల్లో ఇళ్ల స్థలాల్ని మంజూరు చేస్తామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం పర్యటన పూర్తయ్యాక సచివాలయానికి మంజూరయ్యే నిధులతో ప్రణాళిక ప్రకారం రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కాపు నేస్తం పథకంలో భాగంగా ఖాజీపేటలో 221 కుటుంబాలకు ఆర్థికసాయం అందించినట్టు గుర్తు చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ఆయనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పర్యటనలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు చెక్కా సీతమ్మ, కాలిశెట్టి ఫణికుమార్, నాగదేవిక, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ నాయకులు మల్లవరపు బుల్లయ్య, పోలిశెట్టి కోటేశ్వరరావు, గోపిశెట్టి వెంకయ్య, శంకరరావు, పామర్తి సుబ్బారావు, తన్నీరు శ్రీనివాసరావు, ప్రసాదం సురేష్, వీరరాఘవమ్మ, కార్తికేయ, మల్లవరపు విజయ్‌కుమార్, పినపాటి అనిల్, ప్రసాదం రాధారావు, కొలకలూరి నాగేశ్వరరావు, ఉన్నం చినజాన్, అమీర్‌బాషా, రవ్వూరి రవిబాబు, విద్యుత్ ఏఈ వసంతరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వోలు సురేష్, నితిన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

విద్యార్థులతో ప్రదర్శనలు అనుచితం

- కొనసాగితే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చర్యలు
- కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు

తెనాలి: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగే విధంగా విద్యార్థుల్ని రోడ్లపైకి తీసుకొచ్చి ప్రదర్శనలు చేయించడం అనుచితమైన చర్యగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు పేర్కొన్నారు. ఇలాంటి ప్రదర్శనల్ని అడ్డుకొని, సమాజంలో హింస వాతావరణం చోటుచేసుకోకుండా పోలీసులు జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు సంస్థ తరపున వినతిపత్రాన్ని గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని బూర్జువా పార్టీలు, విద్యార్థి సంఘాలు, కాలేజీల యాజమాన్యం వారి రాజకీయ కార్యకలాపాల కోసం విద్యార్థుల్ని వారి తల్లిదండ్రులకు తెలియకుండా ప్రదర్శనలకు వినియోగించడం తగదని ఖండించారు. విద్యార్థుల చదివే కాలాన్ని తగ్గించి, రాజకీయ నాయకులు వారి అవసరాలకు వాడుకుంటే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నిరసనల వల్ల అధికార పార్టీ మీద కోపంతోనే, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా అల్లరిమూకలు అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఇలాంటి ప్రదర్శనలు, ర్యాలీలు అటు సాధారణ ప్రజలకు, విద్యార్థులకు నష్టమేనని అన్నారు. సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను రాజకీయ అవసరాలకు వాడుకోవడం తప్పుగా చెప్పారు. సభ్యులు మహేష్‌కుమార్, నాయక్, మరియదాసు పాల్గొన్నారు.



డీఎస్పీ ఆఫీసులో వినతిపత్రం ఇస్తున్న నాగరాజు

నృసింహుని స్థలంలో ఆక్రమణల తొలగింపు

- అడ్డుకునేందుకు యత్నించిన ఆక్రమణదారులు
- పోలీసుల రక్షణలో తొలగించిన అధికారులు
- రూ.3కోట్ల విలువైన స్థలం స్వాధీనం

మంగళగిరి: నగరంలో వేంచేసివున్న లక్ష్మీనసింహ స్వామి ఆలయానికి చెందిన స్థలంలో అక్రమ కట్టడాన్ని అధికారులు తొలగించి రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయ ధూప దీప, నైవేద్యాలకు పట్టణానికి చెందిన నంబూరు వెంకటప్పయ్య సర్వే నెంబర్‌లోని 233లో 351 చదరపు గజాల స్థలాన్ని 1890 సంవత్సరంలో దానంగా ఇచ్చారు.

అప్పటి అధికారులు పట్టించుకోకపోవడంతో సుమారు 50 సంవత్సరాల క్రితం స్థానికంగా నివాసముంటున్న జంజనం వెంకటేశ్వరరావు ఆక్రమించుకుని వినియోగించుకుంటున్నారు. రెండు నెలల కిందట స్థలం ఆలయానిది అని గుర్తించిన అధికారులు ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారుడు ఖాళీ చేయకపోగా స్థలం ఎన్నో సంవత్సరాలుగా తన ఆధీనంలో ఉందని, తమదేనంటూ శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి మొదటి అంతస్తు శ్లాబు నిర్మాణం చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసి గురువారం ఉదయం అక్రమ కట్టడాన్ని తొలగించేందుకు సన్నద్ధం కాగా అడ్డుకునేందుకు ఆక్రమణదారుడి కుటుంబసభ్యులు తీవ్ర యత్నం చేశారు. చట్టప్రకారం అక్రమ కట్టడాన్ని తొలగించిన అధికారులు సుమారు రూ.మూడు కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అక్రమ కట్టడాల తొలగింపు ఏసీ బొంతు మహేశ్వర రెడ్డి, కాజ గ్రూపు ఆలయాల ఈవో వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

–వైఎస్సార్ సీపీ మహిళా నేతల డిమాండ్

తెనాలి అర్బన్: రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి ఆర్. రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ అత్తోట నాగమణి డిమాండ్ చేశారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూరుకుపోయారని ఆరోపించారు. నేరం రుజువు కావడం వల్లే పోలీసులు అతడ్ని అరెస్ట్ చేసి జైలులో పెట్టారని చెప్పారు. కొందరు టీడీపీ నేతలు దాన్ని జీర్ణించుకోలేక మహిళా మంత్రులపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మహిళ విభాగం నేతలు గాలి అరవింద, బాలగురవమ్మ మాట్లాడుతూ టీడీపీ నాయకులకు మహిళలంటే చిన్న చూపు ఎక్కువన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులు అమల్లోకి వస్తున్నా వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో రెడ్డి రమణమ్మ, రావి ప్రశాంతి, జాకీరా, ఇందిరా ప్రియదర్శి, టి. ప్రశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిలో ముగిసిన పింఛన్ల పంపిణీ



గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శారదకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు



సావిత్రికి పింఛన్ పంపిణీ చేసేందుకు ఐరిస్ తీస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ హరిబాబు



ఇంట్లో చికిత్స పొందుతున్న నాంచారయ్యకు నగదు అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ వరప్రసాద్

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ తెనాలిలో గురువారంతో ముగిసింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వికలాంగ, వితంతు, వృద్ధాప్య, దయాలసిస్ పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్వీఆర్ కాలనీ పరిధిలోని చింతకాయల శారద అనారోగ్యంతో గుంటూరులోని శ్రీకృష్ణ హస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగలక్ష్మి అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. గాంధీనగర్‌కు చెందిన గండికోట సావిత్రికి వృద్ధాప్య పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ ఏ. హరిబాబు అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన బలగూరి నాంచారయ్య అనారోగ్యంతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. అతడికి వెల్ఫేర్ సెక్రటరీ వరప్రసాద్ వృద్ధాప్య పింఛన్‌ను అందించారు. అయితానగర్‌కు చెందిన కదలి వెంకటేశ్వరమ్మకు దయాలసిస్ పింఛన్‌ను వలంటీర్ తాడిబోయిన రామకృష్ణ అందించారు.

– తెనాలి అర్బన్



వెంకటేశ్వరమ్మకు దయాలసిస్ పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామకృష్ణ

యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలభీమసేన భీమయ్య గౌడ్ కుటుంబ సమేతంగా గతనెల 28న గుంటూరులోని భారత్‌పేట 9వ లైనులో నివసించే బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఆయన కుమారుడు రామాంజయ్య (22) బంధువులకు చెందిన మరో రేకుల గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

చిరునవ్వుతో ప్రయోజనాలపై నేడు అవగాహన

గుంటూరు మెడికల్: చిరునవ్వుతో అనేక ఉపయోగాలు ఉన్నాయని డాక్టర్స్ స్మైల్ క్లబ్ వ్యవస్థాపకుడు, డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 6న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ చిరునవ్వు దినోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటలకు స్థానిక ఎస్వీఎన్ కాలనీ పార్కులో, ఉదయం 10 గంటలకు కొత్తపేట పశువుల హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో, కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని కారుమూరి హాస్పిటల్‌లో ఉదయం 11 గంటలకు, అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో మధ్యాహ్నం 3 గంటలకు, పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు చిరునవ్వు ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా తులసి రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ నేత తులసి రామచంద్రప్రభు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తులసి రామచంద్ర ప్రభు, బీజేపీ నాయకుడు తులసి యోగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. యువత మద్యానికి బానిసలుగా మారి విలువైన జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు యువతలో వినియోగాన్ని తగ్గించే మార్గాలపై పురందేశ్వరితో చర్చించారు. పార్టీ అధ్యక్షురాలిగా ఆమె సేవల్ని కొనియాడారు.



పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు